# అభిమాని

కవిత

మగ(వా)డు మెచ్చిందే అందం - అని స్త్రీ సూక్తమవునో కాదో కాని - పెళ్లాం మెచ్చిందే ప్రతిభ - అని సుబ్బారావనే పురుషుడి సూక్తం.

సుబ్బారావ్ - ఏడాది కిందట ఉద్యోగమొచ్చినవాడు.

ఆరు నెలల కిందట అర్ధాంగిని పొందినవాడు.

రెండేళ్ల నుంచీ రచనలు చేస్తున్నవాడు.

అతని కలం పేరు సురా. అతని కోమలి పేరు సుందరి.

సుందరి సార్థక నామధేయురాలు. ఆమె ఎంత అందమయినదంటే - ఆమె అందాన్ని చూసి మెచ్చుకుని - మురిసి మూర్ఛపోయినంత పని చేశాడు సుబ్బారావ్ పెళ్లి చూపుల్లో. వాళ్ల నాన్న కట్నంలో ఐదు వేలు రిబేటిచ్చేశాడు. పెళ్లయి కాపురానికి తెచ్చుకున్నాక రచయితకు తగిన రమణి అన్నారతని మిత్రులు సుందరిని అభినందిస్తూ.

సుబ్బారావు సుందరిని చూసి గర్వపడుతూండాటంత అందగత్తె తనకి అర్ధాంగిగా లభించినందుకు.

అలాగే - తనని చూసి తన భార్య కూడా గర్వపడుతూండాలని అతని ప్రగాఢ వాంఛ. తనలో ఆమె మెచ్చుకోవలసిన అంశం ఖచ్చితంగా ఉందని అతని అభిప్రాయం. తప్పు ఎవరైనా చేస్తారు; త్యాగాలు మాత్రం కొందరే చేయగలరన్నట్లు - ఉద్యోగం ఎవరైనా చేస్తారు; కథలు మాత్రం కొందరే రాయగలరు. ఆ కొందరిలోనూ తనొకడు. తను రాసిన కథలలో కొన్ని అచ్చవుతూంటాయి. అలా అడపా దడపా అచ్చయినవి మరీ తక్కువేం కాదు. పాతిక! పాతిక్కథల ప్రసిద్ధ రచయిత తను. కొన్ని కథలకు పాఠకులు ఉత్తరాల శీర్షికలలో మెచ్చుకుంటూ లేఖలు రాశారు కూడా. కాని, సుందరి తనని రచయితగా గౌరవించడం మాట అటుంచి గుర్తించడానికి కూడా సుముఖత చూపుతున్నట్లు లేదు. "చూశావా శ్రీమతీ! నా కథను మెచ్చుకుంటూ పత్రికలో ఎందరు రాశారో!" అంటూ చూపబోతే, "దాని కేముందీ? దేశంలో పనిలేని వాళ్లెందరో వున్నారు. పత్రికలో పేరు చూసుకుందుకలాగ రాసేవారూ కోకొల్లలే. పత్రికలు పేజీలు నింపుకుందుకూ పబ్లిసిటీకి అలాటి ఉత్తరాలు వేస్తాయి. అమ్మకా లెక్కువౌతాయని ప్రచురిస్తారు. అవన్నీ నిజమనుకోడం తెలివయిన పని కాదేమో?" అంటూ తన కొంగుమీద నీళ్లు జల్లేసింది చప్పగా.



ఏ పత్రిక నుంచో పారితోషికం రాగా... ఆనందం పట్టలేక - "సుందరీ! నా కథకి పారితోషికం పంపారు పత్రికవారు. దీనితో ఏం చేద్దాం?" అని ఉత్సాహంగా అడిగితే -

"దీనికంత బుర్ర బద్దలు కొట్టేసుకోడానికేముంది? ఆ వందతోనో నూట యాభైతోనో మణులూ మాణిక్యాలూ ఏమీ వొచ్చిపడవు కదా? అనవసరంగా ఆయాసపడిపోకండి నాకేమీ రావు ఆ సొమ్ముతో. మీరే ఏ కాగితాలో కవర్లో కొనుక్కోండి" అని తేలికగా తీసిపారేసింది.

సుబ్బారావు చిన్నబుచ్చుకున్నాడు. అతనికి నెలకి రెండు వేలొస్తుంది జీతం. దాని ముందు కథల పారితోషికం స్వల్పమే అంకె పరంగా. కాని... అసలు కంటే వడ్డీ ముద్దు; జీతం కంటే నాతం ప్రీతి - అన్నట్లు ఈ అదనపు సంపాదన అతనికి పరిమితానందాన్నీ గర్వాన్నీ కలుజేస్తూంటుంది.

కాని... సుందరి మాత్రం అతి తేలికగా తీసిపారేస్తుంది.

సుబ్బారావ్ సీరియస్‌గా కథ రాసేందుకు కూర్చుంటే -

"వెధవ కథ కోసం అంత యాతన పడతారెందుకూ? పనిలేని మంగలి పిల్లి బుర్ర గొరిగాడని - ఆ వెర్రి వెర్రి కథలు రాయకపోతే వచ్చి ఉల్లిపాయలు వొలిచిపెట్టకూడదు? నాకు కళ్లు మండుతాయ్ ఉల్లిపాయ లొలిస్తే. కడుపు నిండేనా కాలు నిండేనా కథలతో?" అంటుంది సుందరి.

"కథలు. కడుపూ కాలూ నింపకపోవచ్చు. కాని - రచయితకెంత తృప్తి! మనిషి కేవలమూ తినడం కోసమే బతకకూడదు..."

"కథల్రాయడానికి బతకాలా! జీవితమంటే కథలన్న మాట! ఇంత వరకూ నాకు తెలియనే తెలియదు!" అనేసింది వెటకారంగా.

దానితో సురాకి పౌరుషమూ, పంతమూ వొచ్చేశాయి. సుబ్బారావనే పేరు మోటుగానూ పాతగానూ ఉందని - సురా అనే మోడర్న్ కలం పేరుతో రాయసాగాడు. రచయిత చాలా గొప్పవాడని... మేథావనీ... తనూ అలాటి రచయితల కోవలోనివాడే అనీ... రచయిత భార్య కావడం గర్వకారణమని సుందరి చేత గుర్తింపజెయ్యాలి, అంగీకరింపజెయ్యాలి.

అదీ అతని తాపత్రయం.

అదీ అతని పంతం.

అదీ అతని వ్రతమూ దీక్షా.

అందుకని -

సుందరి సినిమాకెళ్లిన ఓ సాయంత్రం -

అతను ఆరుబయట కుర్చీ వేసుకుని -

ఓ కాఫీ రెండు సిగరెట్లూ తాగి -

సీరియస్‌గా ఆత్మావలోకనం చేసుకోసాగాడు. నిష్కర్షగా ఆత్మవిమర్శ చేసుకోసాగాడు.

నిజంగా తను రచయితేనా?

ఎందుక్కాదు? పాతిక రచనలు అచ్చు చూశాయి, పత్రికలలో. అవి లూకాయి లూకాయి పత్రికలేం కాదు. ప్రాచుర్యమున్నవే. ఆ కథల మీద ఉత్తరాల శీర్షికలో మెచ్చుకోలు లేఖలూ వచ్చాయి. కనుక తను రైటరే.

కాని....

తన కథలకు బహుమతులేమీ రాలేదు. ఐతే మాత్రం? బహుమతి రానంత మాత్రాన తనవి కథలు కాకపోను కాకపోవు. తను రచయిత కాకపోనూ కాకపోడు.

తనకి అభిమానులు లేరు.

ఇంటికొచ్చి నేను మీ అభిమానినంటూ ఎవరూ చెప్పని మాట నిజమే. కాని - పత్రికల్లో తన కథలనభిమానించారుగా? తను రచయిత అని ఈ వూళ్లో చాలామందికి తెలుసు. ఆ మేరకు తను పాప్యులరేగా?

తన కథలు సంపుటిగా రాలేదు. తను ప్రసిద్ధి పొందిన కథా రచయితగా గుర్తింపబడకపోవడానికిదొక కారణం కావచ్చు. పత్రికలో పడే కథ జీవిత కాలం స్వల్పం. సంపుటిలో కథలు శాశ్వతం. కాని...ఏ ప్రచురణకర్తా తన కథలను పుస్తకంగా వేయడానికి అంగీకరించ లేదు - పారితోషికం అక్కర్లేదన్నా. స్వంతంగా వేసుకుందామంటే చేతి చమురు వొదులుతుంది. పైగా అది అమ్ముకోడం మహా యజ్ఞం. అమ్ముడుపోని కథల సంపుటాలూ - అచ్చవక తిరిగొచ్చిన రచనలూ మహా మనస్తాపం. కనుక ఆ జోలికి పోకపోవడమే మేలు.

మరి -

సుందరి చేత తను రైటర్‌గా గుర్తింపబడడమెలా?

ప్రశ్నలు.... ప్రశ్నలు... ప్రశ్నలు. మెదడుని తినేసే మొండి ప్రశ్నలు.

ఒక్కక్షణం సుబ్బారావుకి అనిపించింది. తను పుంఖాను పుంఖాలుగా నవలలూ కథలూ రాసేసి.... అవి అచ్చయి... ఏ పత్రికలో చూసినా తన పేరూ ఫొటో పడిపోతూ... సభలకూ, సమావేశాలకూ పిలుపులొస్తూ... అభిమానులు యింటికి వొచ్చేస్తూ.... మెచ్చుకుంటూ... బహుమతులందజేస్తూ తన భార్య ఐనందుకు సుందరికి కూడా అభినందనలలోనూ, కానుకలలోనూ వాటా యిస్తూంటే....

అలా ఐతే ఆమె గుర్తిస్తుందేమో. కాని... అదంత సులభమూ కాదు, సత్వరమూ కాదు.

మరేమిటి మార్గం?

ఈసారి ఒక టీ, సిగరెట్లు రెండూ తాగి యింకా సీరియస్‌గా ఆలోచించాడు. సుందరి చేత రచయితగా అభినందించబడితే తప్ప అతనికి నిద్రపట్టేటట్టు లేదు.

సుందరిలో - అందం ప్రత్యేకత. అలాగే తనలోనూ రచన అనే ప్రత్యేకత లేకపోతే.... కాకి ముక్కుకి దొండ పండు అనే నానుడిని నిజం చేసిన వాడౌతాడు. అంతే కాదు, ఆమె తనని మరీ తేలికగా చూస్తుంది. ఇప్పటికి కూరలు తరగమనీ ఉల్లిపాయలొలవమనీ అనేస్తూంది. రేపు గిన్నెలు తోమించినా తోమించెయ్యొచ్చు. బట్టలుతికించినా ఉతికించొచ్చు. అలాటి ప్రమాదాలూ అవమానాలూ తప్పాలంటే - తను ఆమె మనసులో రైటర్‌గా ఎస్టాబ్లిష్ అవాలి. ఎలా?

* * * *

ఆదివారం - సాయంత్రం... నాలుగు కావొస్తూంది. సుందరీ, సుబ్బారావూ టీ.వీ. చూస్తున్నారు.

"సుబ్బారావు గారూ!" బయటినుంచి పిలుపు.

"ఎవరో చూడు...." అన్నాడు సుబ్బారావు సుందరితో.

ఆమె వెళ్లి... నిముషంలో తిరిగి వొచ్చి -

"ఎవరో అభిమానిట!" అంది.

"ఆ! అభిమానా!" స్ప్రింగులా లేచి చొక్కా వేసుకోబోయాడు.

"అంత కంగారూ హడావుడీ పడిపోనక్కర్లేదు. అతన్ని కూర్చోబెట్టాను."

"థాంక్స్... సుందీ! చూడూ... కాఫీ.... లేదా.... టీ ప్లీజ్...."

"ఊఁ. ఇదో చాకిరీయా!" మూలిగిందామె.

"అది కాదు సుందరీ! ఇంటికి వొచ్చిన వారికా మాత్రం మర్యాద చేయకపోతే ఎలా? అందులోనూ అతను అభిమానీ, సాహిత్య పిపాసీ...." బ్రతిమాలాడు.


"ఏం అభిమానో! డిటర్జంట్ సబ్బులమ్మే వాళ్లా చేతిలో ప్యాకెట్టు పెట్టుకు మరీ వొచ్చాడు. సరే. టీ పోస్తాన్లెండి వాడి మొహానికి. చూడండీ... అభిమానినంటూ ఏ సబ్బులో అంటగట్టబోతాడేమో అతగాడు... జాగ్రత్త.... మొహమాటానికి పోకండి. ముందే చెబుతున్నాను."

"అలాగే... అంత గట్టిగా అరవకు..." అంటూ తల దువ్వుకుని... ముఖానికి కొంచెం పౌడరూ, గాంభీర్యమూ పులుముకుని - ముందు గదిలోకి వొచ్చాడు సురా.

ఆగంతకుడతన్ని చూస్తూనే లేచి నిల్చుని - "నమస్కారం. మీరు ప్రఖ్యాత రచయిత సుబ్బారావు గారు...?" ఔనా అన్నట్లు ఆగాడు.

"ఔను. మీరు?" అడుగుతూనే కూర్చోమన్నట్టు సైగచేసి తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు సురా.

"నా పేరు వెంకటేశం. మీ అభిమానిని. మీ కథలంటే చెవి




## మిసెస్ యు.ఎస్.ఎ.

అమెరికాలో ఏటా మిసెస్ యు.ఎస్.ఎ. పోటీలు నిర్వహిస్తుంటారు. 1993లో జరిగిన ఈ పోటీలో మిసెస్ యు.ఎస్.ఎ.గా ఎన్నికైన మహిళ మిసెస్ సేండ్రా ఎర్నెస్ట్. వయసు 43 ఏళ్లు. ఈమెకి పదిమంది పిల్లలున్నారు. ఈమె కాలేజీ చదువు పూర్తి కాకుండానే ముగ్గురు బిడ్డలకి తల్లి అయింది. ఈమె భర్త స్టీవ్ కంప్యూటర్ మేనేజర్. వీరి పెద్ద కొడుకు వయసు 21. ఆఖరి సంతానం వయసు 4. పిల్లల ప్రోత్సాహంతో 'మిసెస్ కాలిఫోర్నియా - పోటీలో పాల్గొని నెగ్గి 'మిసెస్ అమెరికా'గా గెలుపొందింది. తమాషా ఏమిటంటే, సేండ్రా తక్కిన పోటీదార్లకన్న 10 నుంచి 20 సంవత్సరాల వరకూ పెద్దది కావడం.

కొనుకుంటాను. మిమ్మల్ని చూడగలగడం నా అదృష్టం. నా అభిమాన రచయితలు మీరు....''

సిరా ఉక్కిరి బిక్కిరై పోయాడా మాటలకు. నా అభిమాన అభిమాని మీరు - అనేసేవాడే. కాని ఎలాగో తమాయించుకున్నాడు.

"మీకు నా రచనలు నచ్చటం చాలా సంతోషం.''

మీరు రాసిన అన్ని కథలూ ప్రాణమే. అయినా వ్యథిత హృదయాలు టాప్ అండీ. బలేగా ఉంటుందా కథ''

"థాంక్స్.''

"మీవంటి రచయితలు నేటి సాహితీ ప్రపంచంలోని కుళ్లునీ, సమాజంలోని అజ్ఞానాంధకారాన్నీ కడిగి పారెయ్యాలి. ప్లీజ్ మీరింకా రాయండి. మీ రచనల కోసం మేమందరమూ చకోర పక్షుల్లా ఎదురు చూస్తూంటాం.''

టీలు పట్టుకొస్తూ - గుమ్మం దగ్గర ఆగి తమ మాటలను సుందరి వింటూండడం క్రీగంట గమనించిన సురా మనసులో తెగ పొంగిపోతూనే-

"ఏదో మీ అభిమానం కొద్దీ అంటున్నారు కానీ - మహా రచయితలెం దరో వున్నారు సాహిత్య సీమలో. వారి ముందు నేనెంత?'' అని వినయం వొలకబోశాడు.

"అలా అనకండి. ఎవరి గొప్ప వారిది. నా దృష్టిలో మీరే మహా రచయిత. మాలాటి వారికోసం మీరు విరివిరిగా రాయాలి. ఇది మీ అభి మానులందరి తరఫునా నా ప్రార్థన -''

టీలు వారిమధ్య పెట్టి - "తీసుకోండి'' అంది సుందరి.

"మా శ్రీమతి సుందరి...'' - "వెంకటేశం గారని.... అభిమాని'' పరి చయం చేశాడు సురా.

"రైటర్ గారి భార్య! సుందరిగారూ! మీరెంత అదృష్టవంతులు!'' అంటూ నమస్కరించాడు వెంకటేశం.

"ఇందులో అదృష్టానికేముంది?'' అనేసిందామె యథాలాపంగా.

"అదేమిటలా అంటారు? ప్రఖ్యాత రచయిత సురా గారి శ్రీమతి కావడం ఎంత అదృష్టం! పూర్వజన్మ సుకృతం కొద్దీ మీరీ ప్రసిద్ధ రచయిత భార్య కాగలిగారు'' అని - సురావేపు తిరిగి ... "మీరేమీ అనుకోకపోతే - మీరంత అందమయిన కథలెలా రాయగలుగుతున్నారో తెలిసిపోయింది నాకు'' అన్నాడు వెంకటేశం.

సురా ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీరేమీ అనుకోనంటే చెప్పేస్తాను సుందరి గారూ! దయచేసి కూర్చోండి! ఆఁ... రచయిత గారి కథలలోని అందానికి సగం కారణం - వారి శ్రీమతి గారే...'' అని నవ్వాడు.

"ఔను'' అని సురా కూడా నవ్వేశాడు.

"చూడండి సురా గారూ! మీరు నా అభిమాన రచయిత. వీరు నా అభిమాన రచయిత గారి శ్రీమతి. మీపట్ల నా అభిమానాన్ని చూపుకో దలుచుకుని వొచ్చాను నేను. కొండంత దేముడికి కొండంత పత్రి సమర్పించుకోడం సాధ్యం కాదు కదా? ఈ అభిమాని నుంచి చిరు కానుకలం దుకని - నన్ను ధన్యుణ్ణి చేయండి...'' అంటూ చెరో ప్యాకెట్టూ అందించా డతను.

"అభిమానముంటే చాలదూ? ఇవన్నీ ఎందుకూ?'' అంటూనే అందుకున్నాడు సురా. సుందరినీ తీసుకోమన్నాడు.

మరో పావుగంట రచనల మీద మాట్లాడి వెళ్లిపోయాడా అభిమాని. ఆ మాటలలో తరచుగా సురాని ఆకాశానికెత్తేశాడు.

అతను వెళ్లాక -

ఆ ప్యాకెట్లు తెరిచాడు సుబ్బారావ్. తెరుస్తూనే - "సుందరీ! నీకు - పట్టుచీర! నీకు ఎంతో నచ్చే నీలం రంగుది... జరీ అంచుది...'' అంటూ అరిచాడానందంగా.

సుందరి దానినందుకుని భుజం మీద వేసుకుంది.

"చూశావా! రచనలన్నా రచయితయిన నేనన్నా తేలికగా చూశావిన్నాళ్లూ. నా రచనలనెంత అభిమానించాడా వెంకటేశం? వొట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్ అన్నట్లు తన అభిమానాన్ని వొట్టి పొగడ్తలతో కాక ఖరీదయిన బహుమతులతో ప్రకటించాడు. ఇలాటి అభిమాని నెల కొకరు తగిలితే యిల్లంతా పట్టుచీరలే. ఏమంటావ్?'' ఉత్సాహంగా చూశాడతను.

ఒక్క నిముషం ఆలోచించి అందామె.

"ఏమంటాను? నాకు పట్టుచీరల పిచ్చి లేదంటాను. జరిగిన దానికి నేనెంత మాత్రమూ సంతోషించడం లేదు సరి కదా విచారిస్తున్నానని కూడా అంటాను. నాకు అనుమానమే అనిపిస్తోంది జరిగినది -''

"సుందరీ!'' తెల్లబోయాడు సుబ్బారావు. "విచారమెందుకూ?'' నిజం గానే తెలియలేదతనికి.

"సినిమా లో ప్రవర్తించినందుకు. సగటు రచయిత రచనలలో లాగా నామీద మీరు చవుకబారు ట్రిక్కు ప్లే చేసినందుకు. మీ గొప్ప తనాన్ని నాచేత గుర్తింపజేసేందుకు మీరు తొక్కిన అడ్డదారి గ్రహించాక విచారం కాక, సంతోషం ఎక్కడ మిగులుతుంది నాకు? నిజమైన రచ యిత తన రచనల గురించే తప్ప అతని గుర్తింపు కోసమని అడ్డదారుల ఆలోచనలు చేయడని నా విశ్వాసం. నిజంగా గొప్ప రచయితలు యిలా కాక ఉన్నతంగానూ ఉదాత్తంగానూ ప్రవర్తించే వారని నా నమ్మకం...''

ఆమె ధోరణికి అవాక్కయిపోయాడు సురా. ఐనా ఎలాగో నోరు పెగి లించుకుని....

"అది కాదు...'' అంటూ ఏదో చెప్పబోయాడు.

"నెలనెలా మీరొక మిత్రుడి చేత అభిమాని పాత్ర ధరింపజేయడమూ, అతని ద్వారా మీకూ నాకూ కానుకలూ, పొగడ్తలూ అందింప జేసుకుం దుకు బోలెడంత డబ్బు ఖర్చు చేయడమూ వ్యర్థమూ మూర్ఖత్వమూ అమాయకత్వమే తప్ప ఎంతమాత్రమూ అవసరమున్నదని అనుకోను. ఎందుకంటే... నిజమయిన గొప్పతనం వెర్రి పొగడ్తలని సహించదు, భరించదు'' అనేసి ఆమె లోపలికి వెళ్లిపోయింది, యింకా అతని ముం దుండడం యిష్టం లేనట్లు.

సురా జుత్తు పీకేసుకున్నాడు. అతని ముందు ఎన్నో ప్రశ్నలు.

ఆ అభిమానని తనే ఏర్పాటు చేసుకున్నాడని సుందరికెలా తెలిసి పోయింది?


తన పథకంలో పొరపాటెక్కడ? అది ఎందుకు బెడిసికొట్టింది?

కథ ఎందుకడ్డం తిరిగింది?

పట్టుచీరెతో కూడా జయించలేని సుందరినింక దేనితో గెలుచు కోవాలి?

అతను గ్రహించలేకపోయినదొక్కటే.

సుందరి చాలా అందమయినది మాత్రమే కాదు; అతి తెలివయినదీ, ప్రాక్టికల్ లేడీ. ❑



## గుండె

ఏనుగు గుండె నిముషానికి 25 సార్లు మాత్రమే కొట్టుకుంటుంది. ఎలుక గుండె వందసార్లు కొట్టుకుంటుంది. అదే పిచ్చుక, బల్లిలలో అయితే గుండె నిముషానికి వెయ్యిసార్లు కొట్టుకుంటుంది. ఒప్పాజం అనే జంతువుకి బాగా కోపం వచ్చినప్పుడు దాని గుండె నిముషానికి 12 వందల సార్లు కొట్టుకుంటుంది. అదే మనుషులలో అయితే నిద్రపోతున్నప్పుడు నిముషానికి 66 సార్లు, కూర్చున్నప్పుడు 72 సార్లు, నిలబడినప్పుడు 81 సార్లు కొట్టుకుంటుంది.

- ఎ.ఎల్.ఆర్. మూర్తి